క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా రత్నకుమార్



సాలూరు: సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా రత్నకుమార్‌ను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. ఇంతవరకు మున్సిపల్ డీఇ ప్రసాద్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరించారు. ఇక్కడి రెగ్యులర్ కమిషనర్ జయరాంను ఏసీబీ అధికారులు ఈ ఏడాది జూన్ నెలలో అరెస్ట్‌చేసిన విషయం పాఠకులకు విదితమే.

విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాన్ని పెంపొందించాలి



మాట్లాడుతున్న డీఈఓ బి.రాజ్‌కుమార్

సీతానగరం: జిల్లాలోని విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను, అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయుల్లో లీడర్ షిప్ క్వాలిటీ పెంచడానికే శిక్షణ తరగతులు అని పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ బి.రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మరిపివలస సూరంపేట వద్ద ఉన్న షిరిడీసాయి పాలిటెక్నిక్ కాలేజీలో ఉపాధ్యాయులకు ఇస్తున్న లీడర్ షిప్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఏఎంఓ జి.కోటేశ్వరరావు, కోర్సుడైరెక్టర్ సామల సింహాచలం, ఎంఈఓ-2 ముvvల వెంకటరమణ.అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ చొక్కాపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రరావుకు నివాళులు



రామచంద్రరావు మృతదేహం వద్ద అంజలి ఘటిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ సిద్ధాబత్తుల రామచంద్రరావుకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర నివాళులు అర్పించారు. పట్టణంలోని వేదస మాజం వద్ద నివాసముంటున్న రామచంద్రరావు మంగళవారం రాత్రి మరణించారు. ఈ మేరకు రాజన్నదొర బుధవారం ఉదయం రామచంద్రరావు ఇంటికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామచంద్రరావు తన జీవితంలో ప్రజలకు ఎన్నో సేవలు అందించారని, గిరిజనుల కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని రాజన్నదొర ప్రార్థించారు. పలువురు సీపీఐ, ఏఐటీయూసీ, గిరిజనసంక్షేమసంఘం తదితర సంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు రామచంద్రరావుకు నివాళులు అర్పించారు.


హోటల్స్‌లో నిబంధనలు పాటించకుంటే చర్యలు



హోటల్స్‌ను తనిఖీచేస్తున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ

సాలూరు: హోటల్స్ నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం సాలూరు పట్టణంలోని పలు హోటల్స్‌ను ఆయన తనిఖీ చేశారు. హోటల్స్ వద్ద ప్లేట్లపై పేపర్ కవర్లు వినియోగించకుండా, అరటిఆకులను వినియోగించాలని సూచించారు. హోటల్‌కు వచ్చే కస్టమర్లకు వేడి నీటిని, నాణ్యమైన ఆహారపదార్థాలను అందించాలని చెప్పారు. వంట గదులు, పాత్రలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆహారపదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న పలు హోటల్స్‌కు రూ.3 వేలు అపరాధ రుసుము విధించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వెంకటభైరిపురంలో తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.రాజశ్రీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పెట్టడం వల్ల బిడ్డకు, తల్లికి ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌పీ విజయ్, ఏఎస్ఎం సరస్వతి, అంగన్వాడీ, ఆశ వర్కర్స్, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి

- కార్లు, ఆటోల్లో ప్రయాణికుల తరలింపు
- రోజుకు రూ.30 నుంచి రూ.40వేలకు పైగా నష్టం
- పార్వతీపురం డిపో పరిధిలో 100 బస్సులు



పార్వతీపురం ఆర్టీసీ డిపో ఇన్ గేట్ వద్ద నిలిపిన ఆటోలు

పార్వతీపురంటౌన్:

జిల్లా కేంద్రం పార్వతీపురం నుంచి అనేక రూట్లలో ఆర్టీసీ బస్సులు నిత్యం వేలాది మందిని తమ గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. సాలూరు, పాలకొండ, కురుపాం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడతో పాటు జిల్లాలోని వివిధ మార్గాల్లో బస్సు సర్వీసులు నడుపుతున్నారు. అయినప్పటికీ ప్రయాణికుల రవాణా అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు తిప్పలేకపోవడంతో చాలా మంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ బస్సులు, ఆటోలు, కార్లు ప్రయాణికులను తరలిస్తుండడంతో ఆశించిన ఆదాయాన్ని ఆర్టీసీ ఆర్జించలేకపోతోంది.

నిత్యం 10 వేల మంది రాకపోకలు

ఆర్టీసీ డిపో నుంచి బస్సుల ప్రతి నిత్యం సుమారు 10 వేల మందిని తమ గమ్యస్థానాలకు చేరుతున్నారు. జిల్లా కేంద్రం, ఒడిశా సరిహద్దు కావడంతో పరిసర ప్రాంతాల్లోని వివిధ మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు సైతం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, కోర్టు, జిల్లా ఆస్పత్రి, ఆయా కార్యాలయాల్లో పనులు చూసుకోవడానికి చుట్టుపక్కల గ్రామాలు, మండల కేంద్రాల నుంచి పార్వతీపురం పట్టణానికి వచ్చే వారి సంఖ్య అధికంగానే ఉంటుంది. వారిలో అధిక శాతం మంది ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు.

డిపోలో 100 బస్సులు

ఆర్టీసీ డిపోలో హైర్, ప్రభుత్వ బస్సులు కలిపి 100 ఉన్నాయి. వాటి ద్వారా డిపోకు నిత్యం రూ.17.50 లక్షల ఆదాయం వస్తుంది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయనగరం, సాలూరు, పాలకొండ వెళ్లే బస్సులకు అధిక ఆదాయం వస్తుంది. కూనేరు, కురుపాం వంటి ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీ పెద్దగా ఉండని కారణంగా ఎక్కువ బస్సులు తిప్పడంలేదు. ఈ మార్గాల్లో ప్రయాణికులను ప్రైవేట్ వాహనాల్లో తరలించడాన్ని కట్టడిచేస్తే డిపోకు మరికొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

నిబంధనలకు ప్రైవేట్ వాహనదారుల తూట్లు

ఆర్టీసీ బస్టాండ్‌కు కనీసం 500 మీటర్లలోపు ప్రైవేట్ వాహనం నిలపకూడదని, ప్రయాణికులను తరలించకూడదని నిబంధనలు ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో ప్రైవేట్ వాహనాల జోరు కొనసాగుతోంది. ఆర్టీసీ డిపో నుంచి నిత్యం విశాఖపట్నానికి బస్సులు తిప్పుతున్నారు. విశాఖపట్నానికి ఉన్న డిమాండ్‌ను ప్రైవేట్ వాహనాలు సొమ్ము చేసుకుంటున్నాయి. సుమారు 8 వరకు ప్రైవేట్ బస్సులు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రయాణికులను తరలిస్తున్నాయి. కురుపాం, కూనేరు, కొమరాడ, ఒడిశా రాష్ట్రంలోని అలమండ, నారాయణపట్నం చుట్టు పక్కల గిరిజన గ్రామాలకు వెళ్లే రూట్లలో ఆర్టీసీ బస్సులు పెద్దగా తిప్పకపోవడంతో ఆయా రూట్లలో ఆటోల వారిదే రాజ్యంగా మారింది. ఇలా ప్రైవేట్ వాహనాల దందా కారణంగా ఆర్టీసీకి రోజుకు సుమారు రూ.30 నుంచి రూ.40వేలకు పైగానే నష్టం వాటిల్లుతోందని అంచనా.

ప్రైవేట్ వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నాం

బస్టాండ్ వద్ద ప్రైవేట్ వాహనాలు, ఆటోలు నిలపకుండా, ప్రయాణికులను తరలించకుండా ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం ద్వారా కట్టడి చేస్తున్నాం. పాత బస్టాండ్ వద్ద ఆటోలకు కూడా అడ్డుకట్ట వేస్తున్నాం. ఆయా వాహనాలను నిరోధించడానికి పోలీసుల సాయం తీసుకుంటున్నాం. ఆర్టీసీ బస్టాండ్‌ల నుంచి ప్రయాణికులను తరలించే ప్రైవేట్ వాహనదారులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– కనక దుర్గ, డిపో మేనేజర్, పార్వతీపురం

ఉజ్వల భవిష్యత్తు కోల్పోతారు



నర్సిపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న రూరల్ పోలీసులు

పార్వతీపురం రూరల్: నషా ముక్త్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్ అడిక్షన్‌పై మండలంలోని నర్సిపురం ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పార్వతీపురం రూరల్ పోలీసులు బుధవారం అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తుపదార్థాల దిశగా ఆకర్షితమవడం ప్రమాదకరమైన పరిణామమని, గంజాయి, బ్రౌన్ షుగర్, వేదన నివారణ మందులు వంటి పదార్థాలు శారీరకంగా, మానసికంగా ఎంతగానో హానికరమని తెలియజేశారు. ఒక్కసారి అలవాటు పడితే ఆరోగ్యానికి ముప్పుతో పాటు, భవిష్యత్తు నాశనమవుతుందని విద్యార్థులను హెచ్చరించారు. ఇలాంటి నేరాల గురించి ఎవరైనా సమాచారం కలిగి ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

రక్తహీనత నివారణకు అవగాహన



గర్భిణులు, బాలింతలకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామంలో ఎనీమియా యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రక్తహీనత నివారణకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ రక్తహీనత నిర్మూలన, రక్తహీనత సమస్యను పరిష్కరించడానికి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి కృషి చేస్తుందని, రక్తహీనత అనేది శరీరంలో ఎర్రరక్త కణాలు తగినంతగా లేనప్పుడు లేదా హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నప్పుడు వచ్చే ఒక వ్యాధి అని వివరించారు. ఇది అలసట, బలహీనత, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలకు దారితీస్తుందని, బాలలు, మహిళల రక్తహీనత నిర్మూలన కోసం భారత ప్రభుత్వం రక్తహీనత ముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా రక్తహీనతను తగ్గించడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. పోషకాహార లోపాలను ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని సూచించారు. రక్తహీనతకు చికిత్సగా ఐరన్ సప్లిమెంట్లను తీసుకోవడం, రక్తహీనతకు గల కారణాలను గుర్తించి చికిత్స చేయడం ద్వారా రక్తహీనతను నయం చేయవచ్చని వివరించారు. ప్రజలకు రక్తహీనత గురించి అవగాహన కల్పించి, నివారణ చర్యల గురించి తెలియచేశారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జీవో 25 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్



మున్సిపల్ ఆర్వో రూబెన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

పార్వతీపురం టౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబ సభ్యులకు జీవో నంబర్ 25 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకుడు గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల రెవెన్యూ అధికారి డి.రూబెన్‌కు సీఐటీయూ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో రెండేళ్ల కాలంలో విధులు నిర్వహిస్తూ అనేక కారణాలతో ముగ్గురు పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులు మరణించారని, వారికి న్యాయం చేకూరుస్తామని ఆనాటి నుంచి అధికారులు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకటనకే తప్ప ఆచరణకు నోచుకోలేదన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో గల అన్ని మున్సిపాలిటీల్లో వివిధ రంగాల్లో మరణించిన కార్మికులకు జీవో నంబర్ 25 ప్రకారం వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారని, కానీ పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో అమలు చేయకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో స్పందించి జలగడుగుల వెంకటరమణ భార్య లక్ష్మికి, బంగారి శ్రీను భార్య నాగమణికి, సీల.శంకరరావు కొడుకు వినయ్‌కుమార్‌కు జీవో నంబర్ 25 ప్రకారం మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.శంకర్రావు, పి.వరదరాజు, సీహెచ్ సింహాచలం, మామిడి శివ, బంగారు రాజేష్, నాగవంశం మల్లేష్, బంగారి బాలు తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి



పోస్ట్ మెట్రిక్ ఎస్టీ బాలుర వసతి గృహం వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌ఓ నాయకులు, విద్యార్థులు

పార్వతీపురం టౌన్: పోస్ట్ మెట్రిక్ ఎస్టీ బాలుర వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు కె.సోమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పోస్ట్ మెట్రిక్ ఎస్టీ బాలుర వసతి గృహం ఆవరణలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో ఇప్పటికే 300 మంది పైనే విద్యార్థులు ఉన్నారన్నారు. డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు కూడా చేరితే ఆ సంఖ్య ఇంకా పెరిగి విద్యార్థులకు మరింత ఇబ్బంది కలుగుతుందన్నారు. విద్యార్థులకు సరిపడినన్ని గదులు లేక ఒకే రూమ్‌లో 30 మంది విద్యార్థులు ఉంటున్న పరిస్థితి ఉందని వాపోయారు. ఆ గదుల్లో సరైన ఫ్యాన్స్ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే బాత్‌రూమ్స్ ఉన్నా సరిగ్గా తలుపులు లేక రన్నింగ్ వాటర్ సదుపాయం, మురుగు నీరు ప్రవహించడానికి కాలువలు కూడా లేవన్నారు. హాస్టల్‌కు ప్రహరీ లేక బయట నుంచి పశువులు, పందులు వస్తున్నాయన్నారు. హాస్టల్లో ఎంతోకాలంగా తిష్ట వేసుకుని ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఓ ఆధ్వర్యంలో నియామకాలు జరగాలి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం, సీతంపేట, పాడేరు ఐటీడీఏల పరిధిలోని ఏకలవ్య 'పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల నియామకాలు ఆయా ఐటీడీఏల పీఓల ఆధ్వర్యంలో చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియామకపు అధికారం ప్రిన్సిపాల్‌కు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఈ పోస్టులు ఆయా జిల్లాల్లోని అర్హులైన గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాదిగా పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు రెగ్యులర్ పీఓలను నియమించలేదని ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎఫ్ఏసీ పీఓలుగా విధులు నిర్వహిస్తున్న అశుతోష్ శ్రీ వాస్తవ్, యశ్వంత్ కుమార్ రెడ్డిలను రెగ్యులర్ ఐటీడీఏ పీఓలుగా నియమించి ఇక్కడే కొనసాగించాలని కోరారు.

ఘనంగా మజ్జి గౌరమ్మ వారాల పండుగ



ప్రభను ఊరేగిస్తున్న దృశ్యం

మక్కువ: స్థానిక కుమ్మరి వీధివాసులు మజ్జి గౌరమ్మ తల్లి వారాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారి వెంబడి అమ్మవారి ప్రభను డప్పు వాయిద్యాలు, యువత కేరింతల మధ్య ఊరేగిస్తూ మజ్జి గౌరమ్మ గుడికి చేరుకున్న అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కోళ్లు, చీరలు, మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో మజ్జి గౌరమ్మ తల్లి వారాల పండుగ జరుపుకోవడం కుమ్మరి వీధి వాసుల ఆనవాయితీ. కార్యక్రమంలో శాలివాహన సంఘ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు శంకరరావు, వీధివాసులు,పెద్దలు పాల్గొన్నారు.

7న ప్రపంచ తల్లి పాల వారోత్సవాల ముగింపు

పార్వతీపురంటౌన్: ప్రపంచ తల్లి పాల వారోత్సవాలముగింపు కార్యక్రమాన్ని సాలూరులో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి డా.టి.కనక దుర్గ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను సాలూరులోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరవుతారన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను ఈ నెల 1వ తేదీన ప్రారంభించామని, ఇందులో భాగంగా బిడ్డ పుట్టిన గంటలోపే పాలిచ్చేలా తల్లికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. తల్లి పాలల్లో వివిధ రకాల పోషకాలుంటాయని మహిళలకు వివరించామన్నారు. ముగింపు కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ప్రకటనలో ఆమె కోరారు.

7న జాతీయ చేనేత దినోత్సవం

జాతీయ చేనేత దినోత్సవాన్ని ఈ నెల 7వ తేదీన బలిజిపేట మండలం నారాయణపురం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి టి.జనార్దనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, కలెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. చేనేత సంఘాల సభ్యులు, అనుభవజ్ఞులు పాల్గొని వివిధ అంశాలను వివరిస్తారని పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఆర్‌జేడీ మజ్జి ఆదినారాయణ

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లపై దృష్టి సారించాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆర్‌జేడీ మజ్జి ఆదినారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వై.నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీతో మూడవ విడత అడ్మిషన్ల షెడ్యూల్ ముగియనున్నందున ప్రిన్సిపాల్స్ అందరూ అడ్మిషన్ల పెంపుదలపైన దష్టి సారించాలని తెలియజేశారు. ప్రతి వారం వారాంతపు పోటీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, పేపర్లను మూల్యాంకనం చేసి మార్కులను ఆన్‌లైన్ ద్వారా పోస్ట్ చేయాలని ప్రిన్సిపాల్స్‌కు తెలియజేశారు. ముఖ ఆధారిత అటెండెన్స్‌ను ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా సిబ్బంది అందరూ వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు సిలబస్, ప్రశ్నపత్రాల కూర్పు మారినందున విద్యార్థులందరికీ తగు విధంగా మారిన ప్రశ్నపత్రాల పైన, సిలబస్‌పైన తగు పరిజ్ఞానాన్ని కల్పించాలని కోరారు.

సీపీఎస్ రద్దు హామీని అమలు చేయాలి

సీతానగరం: ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సీపీఎస్ విధానం రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు చేయనందుకు నిరసనగా రాష్ట్రస్థాయిలో విజయవాడలో జరగనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ గణపతి, రాష్ట్ర అదనపు కార్యదర్శి గురాన శ్రీనివారరావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో బుధవారం వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసి పాతవిధానాన్ని పునరుద్ధరించడానికి ఎన్నికల సమయంలో పాలకులు ఇచ్చిన హామీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి గురాన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ విధానంపై సరైన నిర్ణయం తీసుకుని ప్రకటించాలన్నారు. అలాగే ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ విధానంర ద్దు చేసి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఈ మేరకు సీపీఎస్ విధానం రద్దును కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన జరగనున్న చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఇటీవల విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ సభ్యులు, ప్రతినిధులు ఎం.విజయలక్ష్మి, పి.శ్రీనివాస్, సీహెచ్ రజనీకాంత్, యు.శ్రీనివాస్, ఎం. శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురం టౌన్: పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు. ఈ నెల 12న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న డీవార్మింగ్ కార్యక్రమానికి జిల్లాకు సరఫరా చేసిన ఆల్బెండజోల్ మాత్రలను డీఎంహెచ్ఓ బుధవారం వైద్య సిబ్బందికి పంపిణీ చేసి పోస్టర్లు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి క్షేత్రస్థాయిలో సన్నద్ధం కావాలని వైద్య, విద్య, అంగన్వాడీ, సంబంధిత శాఖలతో మండల, సచివాలయ స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వరకు పిల్లలు, విద్యార్థులకు ఈనెల 12న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. 1 నుంచి 2 సం.పిల్లలకు సగం మాత్ర పొడి చేసి నీటితో కలిపి ఇవ్వాలి. 2 నుంచి 3సం పిల్లలకు పూర్తి మాత్ర పొడి చేసి నీటితో కలిపి ఇవ్వాలి. 3 నుంచి 19 సంవత్సరాల వరకు పూర్తి మాత్ర బాగా నమలాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లాకు మొత్తం 2,13,000 ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా అయినట్లు చెప్పారు. జిల్లాలో 1,96,612 మంది అంగన్వాడీ, పాఠశాల,కళాశాల పిల్లలు, విద్యార్థుల లక్ష్యంగా ఆల్బెండజోల్ 400మి.గ్రా. మాత్రలు వేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా.పీఎల్ రఘుకుమార్, సూపరింటెండెంట్ కామేశ్వరరావు, సీడీఎస్ ఫార్మసిస్ట్ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణ లక్ష్యంగా కార్యాచరణ

రక్తహీనత నివారణ లక్ష్యంగా ఎనీమియా ఏక్షన్ కమిటీలు కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని 12వ వార్డులో నిర్వహించిన ఎనీమియా ఏక్షన్ కమిటీ సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్ మోహనరావు, డా రఘు కుమార్, వైద్యాధికారి డా రవిచంద్ర, సూపర్‌వైజర్ పుష్ప, వార్డు సెక్రటరీ జి.పవన్ కుమార్ , వైద్య, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కడుపు నిండాలంటే బరువు మోయాల్సిందే



కొత్తవలస నుంచి రేషన్ బియ్యం మోసుకుని వెళ్తున్న కోదుకరకవలస గ్రామస్తులు

సాలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల తొలగింపుతో పేదలు నెలకోసారి దూరాభారంలో ఉన్న రేషన్ డిపోలకు వెళ్లి బరువులు మోయాల్సిన పరిస్థితి ప్రతి ఇంటికి తప్పడం లేదు. సాలూరు మండలంలోని ఏజన్సీ ప్రాంతవాసులు ఎలాగూ కిలోమీటర్ల దూరం బియ్యం కోసం నడవాల్సిన పరిస్థితి. అంతే కాకుండా మైదాన ప్రాంత ప్రజలు కూడా దాదాపు 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ డిపోలనుంచి బియ్యం మూటలు మోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో బుధవారం కొత్తవలస డిపోనుంచి కోదుకరకవలస గ్రామస్తులు బియ్యాన్ని భుజాలపై వేసుకుని నాలుగు కిలోమీటర్ల దూరం బరువు మోసుకుని వెళ్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీఎస్ రద్దు హామీని అమలు చేయాలి

సీతానగరం: ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సీపీఎస్ విధానం రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు చేయనందుకు నిరసనగా రాష్ట్రస్థాయిలో విజయవాడలో జరగనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ గణపతి, రాష్ట్ర అదనపు కార్యదర్శి గురాన శ్రీనివారరావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో బుధవారం వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసి పాతవిధానాన్ని పునరుద్ధరించడానికి ఎన్నికల సమయంలో పాలకులు ఇచ్చిన హామీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి గురాన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ విధానంపై సరైన నిర్ణయం తీసుకుని ప్రకటించాలన్నారు. అలాగే ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ విధానంర ద్దు చేసి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఈ మేరకు సీపీఎస్ విధానం రద్దును కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన జరగనున్న చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఇటీవల విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ సభ్యులు, ప్రతినిధులు ఎం.విజయలక్ష్మి, పి.శ్రీనివాస్, సీహెచ్ రజనీకాంత్, యు.శ్రీనివాస్, ఎం. శ్రీనివాసరావు, పాల్గొన్నారు.